# బలగం TV BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 20 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4




అనారోగ్యంతో మృతి చెందిన బలగం సినిమా ఫేమ్ మొగిలయ్య మృతదేహానికి నివాళ్లర్పిస్తున్న బలగం టీవి సీఈఓ బాలు కాయితీ

# ఓఆర్ఆర్ టెండర్లపై సిట్

- శాసనసభలో ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి
- మంత్రివర్గంలో చర్చించి విధానాలు రూపొందిస్తాం
- బీఆర్ఎస్ అప్పనంగా టెండర్‌దారులకు అప్పగించిందంటూ వ్యాఖ్య
- హరీశ్‌రావు కోరిక మేరకు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ ప్రభుత్వంలో 30 ఏళ్ల లీజ్ కు ఇచ్చిన ఓఆర్ఆర్ టెండర్‌పై విచారణకు ఆదేశిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరిక మేరకు విచారణకు ఆదేశిస్తున్నట్లు చెప్పారు. కాగా, అసెంబ్లీలో నేడు ఆర్థిక వ్యవహారాలపై జరిగిన స్వల్ప కాలిక చర్చలో పాల్గొన్న హరీశ్ రావు తాము ఓఆర్ ఆర్ ను అమ్మివేశారంటూ కాంగెస్ నేతల ప్రచారాన్ని తప్పు పట్టారు.. ప్రభుత్వం మీ చేతుల్లోను ఉందని, మీరు ఆ టెండర్ ను రద్దు చేయవచ్చని అన్నారు..

దీనిపై స్పందించిన రేవంత్ రెడ్డి దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జైకా నుంచి నిధులు తెచ్చి ఓఆర్ఆర్ నిర్మించారన్నారు. . దాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పన్నంగా టెండర్‌కు అప్పగించిందని ధ్వజమెత్తారు. ఎయిర్ పోర్టు, ఓఆర్ఆర్, ఐటీ కంపెనీలను తీసుకొచ్చి హైదరాబాద్‌ను విశ్వనగరంగా చేసింది కాంగ్రెస్ అన్నారు. క్రెడిట్ అంతా కాంగ్రెస్‌కే దక్కుతుందని తెలిపారు. అంతేకాకుండా ప్రజల అవసరాలు తీర్చాలని కృష్ణ, గోదావరి నీళ్ల తేవడానికి పీజేఆర్ ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. హైదరాబాద్‌కు మెట్రో రైలు తీసుకొచ్చింది కూడా కాంగ్రెస్సే అని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా మారడానికి కాంగ్రెస్ కారణమని వివరించారు. వేల కోట్ల ఓఆర్ఆర్ ఆస్తిని అప్పన్నంగా అమ్ముకున్నారని బీఆర్ఎస్‌పై రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలు ఓడించబోతున్నారని తెలిసి.. అమ్మేసుకున్నారని ఆరోపించారు. దేశం విడిచిపెట్టి పోవాలనే ఉద్దేశంతోనే ఓఆర్ఆర్ ఆస్తులను గత ప్రభుత్వాధినేతలు అమ్మేసుకున్నారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక దీనిపై హరీశ్‌రావు విచారణ కోరారని, .. ఆయన కోరిక మేరకు సిట్ విచారణకు ఆదేశిస్తున్నట్లు రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. విధివిధానాలు కేబినెట్‌లో చర్చించి విచారణ చేయిస్తామన్నారు.

ఓఆర్ఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సిట్ విచారణకు ఆదేశించడంపై హరీశ్‌రావు స్పందించారు. ఓఆర్ఆర్ టెండర్‌పై తాను విచారణ కోరలేదన్నారు. అయినా కూడా విచారణను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ముందు టెండర్ రద్దు చేసి విచారణకు ఆదేశించాలని కోరారు

## బలగం గాయకుడు మొగిలయ్య కన్నుమూత

- కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మొగిలయ్య
- సంతాపం తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బలగం టీవి సీఈఓ బాలు



వివరాలు 4వ పేజీలో

# కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్

**ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో ఏసీబీ నమోదు**

**4 సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసులు**

**ఐఏఎస్ అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ సీఈఓ బీఎల్ఎన్ రెడ్డిల పైనా**

**ఏ1గా కేటీఆర్, ఏ2గా అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డి**

**ఏసీబీ కోర్టుకు ఎఫ్ఐఆర్ సమర్పించిన దర్యాప్తు అధికారులు**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రపంచ ఖ్యాతి గుర్తింపు పొందిన ఫార్ములా ఈ రేసు నిర్వహించిన అంశంలో మాజీ మంత్రి కేటీఆర్‌పై అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసింది. నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై గవర్నర్ అనుమతితో ఏసీబీ కేసు నమోదు చేశారు. కేటీఆర్‌తోపాటు ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌తోపాటు ఓ ప్రైవేటు సంస్థ సీఈఓ బీఎల్ఎన్ రెడ్డిపై కూడా కేసు నమోదవడం గమనార్హం. ఏసీబీ కేసు నమోదు కావడంతో నేడో.. రేపో కేటీఆర్ అరెస్ట్ ఉంటుందనే వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై ఏసీబీ అధికారులు ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి నాలుగు కేసులను నమోదు చేశారు. ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఏ1గా కేటీఆర్, ఏ2గా అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డి ల పేర్లను చేర్చారు. అలాగే, ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి భాగస్వాములైన దాదాపు నాలుగు కంపెనీల పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. ప్రభుత్వానికి చెందిన రూ.55 కోట్లను ఎలాంటి అనుమతులూ తీసుకోకుండా ఫార్ములా-ఈ కార్ రేసింగ్ నిర్వహణ కోసం ఏకపక్షంగా సదరు కంపెనీలకు విడుదల చేసి పైన నిందితులుగా పేర్కొనబడిన ముగ్గురు అవినీతికి పాల్పడినట్టు ఏసీబీ ఆరోపించింది. దీని ఆధారంగా ముగ్గురి పైనా అవినీతి నిరోధక చట్టంలోని 13(1), 13(2)తో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 409, 120బి సెక్షన్ల కింద కేసులను నమోదు చేశారు. అయితే, ఈ కేసులన్నీ నాన్-బెయిలబుల్ కిందకే వస్తాయి.

ఎఫ్ఐఆర్ నమోదు చేశాక దీనికి సంబంధించిన సమాచారాన్ని నాంపల్లిలోని ఏసీబీ కేసుల ప్రత్యేకకోర్టుకు అధికారులు అందజేశారు. నమోదు చేసిన కేసులకు సంబంధించిన సమాచారాన్ని కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు ఏసీబీ అధికారులు అందజేయనున్నారు. అనంతరం, దర్యాప్తు ప్రక్రియను ముందుకు సాగించనున్నారు. కాగా, ఈ కేసులో సమగ్రంగా దర్యాప్తు సాగించటానికి ఏసీబీలో దాదాపు 45 మందికి పైగా అధికారులు, సిబ్బందితో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌ను ఆ విభాగం అధిపతి విజయ్‌కుమార్ ఏర్పాటు చేశారు.

# సంక్రాంతి తర్వాత కొత్త రేషన్‌కార్డులు

- అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో అర్హులందరికీ సంక్రాంతి తర్వాత కొత్త రేషన్‌కార్డులను ఇవ్వబోతున్నట్టు శాసనసభ సాక్షిగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఒకట్రెండు నెలల తర్వాత రేషన్ కార్డులపై సన్నబియ్యాన్ని ఇస్తామని చెప్పారు. లబ్ధిదారులకు నగదు బదిలీ ప్రక్రియను అమలు చేయబోమని స్పష్టం చేశారు. గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో రేషన్‌కార్డులు, రేషన్‌డీలర్ల సమస్యపై సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. రేషన్ కార్డులపై 9 రకాల సరుకులు ఇవ్వాలని కోరారు. కల్తీని నియంత్రించాలనీ, రీసైక్లింగ్ ప్రక్రియకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థను రద్దు చేసి నగదు బదిలీ చేస్తారనే చర్చ నడుస్తున్నదనీ, అది వాస్తవమేనా అని ప్రశ్నించారు. నిరుపేద డీలర్లకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరారు. అందరికీ ఎప్పటిలోగా రేషన్‌కార్డులు ఇస్తారనే దానిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్ సభ్యులు మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..డీలర్లకు కమీషన్ పెంచాలని కోరారు. గన్నీ బ్యాగుల తూకం తీసేయకపోవడం, వాటికి తూట్లు పడి రవాణా సమయంలో పోవడం, తదితర కారణాలతో ప్రతిబస్తాలోనూ రెండు, మూడు కేజీల బియ్యం తక్కువ వస్తున్న అంశాన్ని లేవనెత్తారు. నేరుగా ప్రతి లబ్ధిదారునికీ ఆరుకేజీల బ్యాగుల్లో బియ్యం ఇచ్చే ఆలోచన చేయాలని సూచించారు. రేషన్ డీలర్లకు పెండింగ్‌లో ఉన్న రూ.500 కోట్లు విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ సభ్యులు వాకిటి శ్రీహరి మాట్లాడుతూ..రెండు, మూడు గ్రామాలకు ఒకే రేషన్ షాపు ఉంటే..ఆ రెండు గ్రామాల్లోనూ కొన్ని రోజుల చొప్పున బియ్యం ఇస్తే లబ్ధిదారులకు మేలు జరుగుతుందన్నారు.

సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 17,256 రేషన్ షాపులున్నాయని తెలిపారు. రేషన్‌డీలర్లకు ప్రతి క్వింటాపైనా రూ.140 చొప్పున కమీషన్ ఇస్తున్నామన్నారు.

రేషన్‌డీలర్లు తమ కమీషన్‌ను రూ.300కు పెంచాలని అడిగారనీ, వేతనం కాకుండా గ్రామీణప్రాంతాల డీలర్లకు రూ.30 వేలు, పట్టణ ప్రాంత డీలర్లకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారని తెలిపారు. వారు అడిగినంత కాకపోయినా దానిపై త్వరలో ఏదో ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రేషన్‌కార్డుపై లబ్ధిదారులకు 9 సరుకుల అందజేత గురించి ఆలోచిస్తామని చెప్పారు. పీడీఎస్ బియ్యాన్ని ఏ డీలరైనా పక్కదోవ పట్టించినట్టు తెలితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొత్త రేషన్‌షాపులు ఇస్తూ పోతే డీలర్లకు కోటా తగ్గే అవకాశముందన్నారు. అయితే, కొత్త పంచాయతీల్లో అవసరాలను గుర్తించి కొత్తవాటిని మంజూరు చేస్తామని హామీనిచ్చారు. డీలర్ల వద్ద కొచ్చే బియ్యం బస్తాల్లో ఒకటి నుంచి మూడు కేజీలు తక్కువ వస్తున్న మాట వాస్తవమేనన్నారు. దీన్ని నివారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే ప్రత్యేకంగా వే బ్రిడ్జిలను ఏర్పాటు చేస్తామన్నారు. డీలర్లకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలనే ఆలోచన తమ ప్రభుత్వ దృష్టిలో ఉందని చెప్పారు.

## రూపాయి విలువ పతనం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**




రూపాయి మారకం విలువ దారుణంగా క్షీణించింది. డాలర్‌తో పోలిస్తే తొలిసారి 85 రూపాయలకు పడిపోయింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లను 25 బీపీఎస్‌ను తగ్గించడం, 2025 నాటికి మరిన్ని తగ్గింపులు ఉండే అవకాశం ఉందన్న సంకేతాల నేపథ్యంలో రూపాయి విలువ క్షీణించింది. బలహీన మూలధన ప్రవాహాలకు తోడు ఇతర ఆర్థిక సవాళ్ల కారణంగా ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న కరెన్సీపై ఇది అదనపు భారాన్ని మోపింది.

డాలర్‌తో పోలిస్తే బుధవారం రూపాయి మారకం విలువ రూ. 84.9525కు పడిపోగా, గురువారం మరింత క్షీణించి రూ. 85.0650కు దిగజారింది. రెండు నెలల్లోనే రూపాయి మారకం విలువ రూ. 84 నుంచి 85కు పడిపోవడం గమనార్హం. అదే సమయంలో రూ. 83 నుంచి రూ. 84కు క్షీణించడానికి 14 నెలల సమయం పట్టింది. అంతకుముందు రూ. 82 నుంచి రూ. 83కు పతనం కావడానికి 10 నెలల సమయం పట్టగా, ఇప్పుడు కేవలం రెండు నెలల్లోనే రూ. 84 నుంచి రూ. 85కు పడిపోయింది. అయితే, భారత కరెన్సీ ఒక్కటే కాదు, ఇతర దేశాల కరెన్సీ కూడా భారీగా క్షీణించింది. ఆసియా దేశాల కరెన్సీ కూడా గురువారం భారీగా పతనమైంది. కొరియన్ వాన్, మలేసియా రిగ్గిట్, ఇండోనేషియన్ రుపయా 0.8 శాతం నుంచి 1.2 శాతం క్షీణించింది.

# నేను ఏ తప్పు చేయలేదు

- రాష్ట్రాన్ని ఎలక్ట్రిక్ వాహనాలకు హబ్‌గా మార్చేందుకే రేస్
- న్యాయపరంగా ఎదుర్కొంటాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రాన్ని ఎలక్ట్రిక్ వాహనాలకు హబ్‌గా మార్చాలనే లక్ష్యంతోనే హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ కార్ రేస్ నిర్వహించామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో అవినీతి నిరోధక శాఖ(ఏసీపీ) తనపై కేసు నమోదు చేసిన నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

హైదరాబాద్‌లో ఫార్ములా- ఈ కార్ రేస్ జరపాలని చాలా ప్రయత్నాలు జరిగాయన్న కేటీఆర్ 2001లోనే చంద్రబాబు ఫార్ములా-1 రేస్ నిర్వహించేందుకు యత్నించారని తెలిపారు. దురదృష్టవశాత్తు చంద్రబాబు ప్రయత్నాలు ఫలించలేదన్నారు. ఫార్ములా- ఈ కార్ అంశంపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని కోరామని పేర్కొన్నారు. నాలుగు కోట్ల ప్రజల మధ్య చర్చ పెడదాం అని స్పీకర్‌ను కోరానన్న ఆయన ఫార్ములా- ఈ కార్ అంశంపై చర్చించే సత్తా ప్రభుత్వానికి లేదని విమర్శించారు. ఫార్ములా- ఈ కార్ అంశంలో అక్రమాలు చేశామని ప్రభుత్వం అంటుందన్న కేటీఆర్ వాటిని నిరూపించకుండా లీకులిస్తూ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి దమ్ముంటే అసెంబ్లీలో ఇదే అంశంపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. రోజుకో అంశంపై అసెంబ్లీలో చర్చ పెట్టి సమగ్రంగా చర్చించాలని సవాల్ విసిరారు.

ఫార్ములా-1 రేస్ ట్రాక్ కోసం గోపన్ పల్లిలో భూసేకరణ జరిగిందని కేటీఆర్ తెలిపారు. అక్కడ సీఎం రేవంత్ రెడ్డికి కూడా 15 ఎకరాల భూమి ఉందని వివరించారు. ఎఫ్-1 చుట్టూ నగరాల అభివృద్ధి ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఎఫ్-1 రేస్‌ల నిర్వహణకు దేశవ్యాప్త పోటీ ఉందని కేటీఆర్ అన్నారు. చంద్రబాబు 2001లో జినోమ్ వ్యాలీని ఏర్పాటు చేశారని కేటీఆర్ గుర్తు చేశారు. నాడు ఏర్పాటు చేసిన జినోమ్ వ్యాలీ ఇప్పుడు ఉపయోగపడుతుందన్నారు.

ఫార్ములా ఈ రేసింగ్ ప్రమోటర్లు గతేడాది డిసెంబర్ 13న సీఎం రేవంత్ రెడ్డిని కూడా కలిశారు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. వచ్చే మూడేండ్లు రేసింగ్ నిర్వహిస్తామంటూ దాన కిశోర్‌కు ఆల్బర్టో లేఖ రాశారు. మరోసారి నిర్వహణపై డిసెంబర్ 21 లోపు స్పష్టత ఇవ్వాలని మెయిల్ పెట్టారు. రేసింగ్ రద్దు అయిపోగానే ఎఫ్ఎంఎస్ వాళ్లు రూ. 74 లక్షలు చెల్లించారు. ఇవన్నీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం దాచి పెడుతుందని కేటీఆర్ తెలిపారు.

రేవంత్ రెడ్డి చేసే లత్కోర్ పని ఇది. మా మీద కేసులు పెట్టి సతాయిస్తాం అంటే.. ఒక్కటి చెబెతున్నాం.. ఉద్యమ నాయకుడి బిడ్డలం సైనికులు.. నీలాంటి చిల్లర కేసులకు భయపడేటోడు ఎవరూ లేరు. ఏం చేసుకుంటావో చేస్కో. రేవంత్ సర్కార్, ఫార్ములా ఈ మధ్య జరిగిన ప్రత్యుత్తరాలకు సంబంధించిన కాపీలన్నీ ఏసీబీ, పోలీసులు, కోర్టుకు ఇస్తాను. నేను ఏ తప్పు చేయలేదు. బరాబర్ చెబుతున్నా.. తప్పు చేయలేదు.. ఆత్మ విశ్వాసం ఎక్కువ. ప్రజలు అన్ని గమనిస్తున్నారు అని కేటీఆర్ పేర్కొన్నారు.

అమృత్ స్కాం, మూసీ లూటీ, రేవంత్ రెడ్డి అన్నదమ్ముళ్ల అరాచకాలను ఢిల్లీ స్థాయిలో ఎక్స్‌పోజ్ చేస్తున్నాం.. కాబట్టి కడుపు మంటతో చేస్తున్నావ్.. అయినా ఏం భయపడం.. ఏం చేసుకుంటావో చేసుకో. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేదానికి రేస్ నిర్వహించాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫార్ములా ఈ వారు ఉత్తరం రాశారు. లైసెన్స్ ఫీజు వాస్ తీసుకోమని లేఖలు రాశారు. అవి దాచిపెట్టి కాంగ్రెస్

మిగితా 2వ పేజీలో

చరిత్ర చదువుకుంటూనే

# భవిష్యత్తు తరాలకు మంచి సందేశం ఇవ్వగలం



- సీఎం రేవంత్ రెడ్డి
- ఎన్టీఆర్ స్టేడియంలో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

చరిత్ర చదువుకుంటూనే భవిష్యత్తు తరాలకు మంచి సందేశం ఇవ్వగలమని, రాబోయే రోజుల్లో బుక్ ఫెయిర్ లాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ను ఇవాళ ఆయన ప్రారంభించారు. బుక్ స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో పుస్తకాల ప్రాధాన్యత తగ్గుతోందని చెప్పారు. ఈ క్రమంలో భావి తరానికి స్ఫూర్తినివ్వాలని బుక్ ఫెయిర్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. మనం చరిత్ర చదువుకుంటేనే భవిష్యత్‌కు సరైన మార్గాన్ని నిర్దేశించుకోవచ్చని నేటి తరానికి చెప్పాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. తమ కలం, గళం ద్వారా సమాజానికి చైతన్యాన్ని అందించడంతో పాటు ప్రజా పోరాటాలు చేసిన కవులు, కళాకారుల పేర్లు బుక్ ఫెయిర్ వేదికలకు పెట్టడం ద్వారా సందేశాన్ని ఇచ్చారన్నారు. సాయుధ రైతాంగ పోరాటం, తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమంలో కూడా చరిత కొంత వక్రీకరణకు గురైందన్నారు. తెలంగాణ ఉద్యమంలో సమిదలైన వారి కంటే రాజకీయ ప్రయోజనం పొందిన వారికే ఎక్కువ పేరు వచ్చిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో పోరాటంలో చేసిన వారి పేర్లు చరిత్రలో ఉండాలన్నారు. చదివిన పుస్తకాలు, చైతన్య పర్చిన గానం నుంచి క్రోడీకరించి తాను ఉమ్మడి ఏపీ అసెంబ్లీలో తెలంగాణ బిల్లుపైన మాట్లాడానన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో డిజిటల్ మీడియా కారణంగా పుస్తకాల ప్రాధాన్యత తగ్గిపోతోందన్నారు.

చరిత్ర చదువుకుంటూనే భవిష్యత్తు తరాలకు మంచి సందేశం ఇవ్వగలమన్నారు. మంచి సందేశం ఇవ్వడం కోసమే బుక్ ఫెయిర్ లో తాను, తమ మంత్రులు పాల్గొన్నామన్నారు. సామాజిక చైతన్యం, సమాజంలో వచ్చే మార్పులపై చర్చించడానికి బుక్ ఫెయిర్ మంచి వేదికగా ఉంటుందన్నారు. చరిత్రకారులను గుర్తించుకోవడం కోసమే తెలుగు యూనివర్సిటీ కి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టుకున్నామన్నారు. కాళోజీ, దాశరథి లాంటి కవులెందరో తెలంగాణ తొలి ఉద్యమానికి స్ఫూర్తి ఇచ్చారన్నారు. అందె శ్రీ, గూడ అంజయ్య, గద్దర్ లాంటి వారు మలి తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ఇచ్చారన్నారు. నిజమైన చరిత్రను తెలియజేయడానికి ఏర్పాటైన పుసక్త ప్రదర్శనకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత గౌరవం ఇస్తుందన్నారు. బుక్ ఫెయిర్ ప్రారంభోత్సవంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణరావు, ఎమ్మెల్సీ కోదండరామ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, హెచ్‌బీఎఫ్ అధ్యక్షుడు డా.యాకూబ్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులే ప్రశ్నలు అడగడమేంటి?

- అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వర్సెస్ హరీశ్‌రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అసెంబ్లీలో గురువారం నల్లొండ నీటి విషయంపై చర్చ కొనసాగింది. ప్రశ్నోత్తరాల సమయంలో తొలుత సభ్యులు నల్గొండ జిల్లాలో మూసీ నీటిపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి నల్గొండ జిల్లాలోని నీటి సమస్యలు క్షుణ్ణంగా వివరించారు. అయితే ప్రశ్నోత్తరాల్లో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టుల నిర్మాణ సమస్యల గురించి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పలు ప్రశ్నలు అడగటాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు ఒక మంత్రి నిల్చుని మరో మంత్రిని ప్రశ్నలు అడిగితే ఇంకా ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుందని అన్నారు. ఈ వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి ఫైర్ అయ్యారు. క్వశ్చన్ అవర్‌లో హరీష్ రావు ఏ హోదాలో మాట్లాడుతున్నారని ప్రశ్నించారు.

ఈ విషయంపై మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే హరీశ్ రావు మధ్య వాడీవేడి సంభాషణ సాగింది. హరీష్ రావుపై కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీష్ రావు.. డిప్యూటీ లీడర్‌నా? ఎమ్మెల్యేనా? ఏ హోదాలో మాట్లాడుతున్నారని అన్నారు. ఈ విషయంలో ఆయనకు అడిగే హక్కు లేదన్నారు. ప్రతిపక్ష నేత ఏడాదిగా సభకు రాకపోవడం సభకే కాదు.. తెలంగాణ ప్రజలకు అవమానపరచడమే కోమటిరెడ్డి అన్నారు. నల్గొండ ప్రజల కడుపులో ఆవేదన ఎలా ఉంటుందో చెప్పానన్నారు. డబ్బున్న వాళ్లు హైదరాబాద్ వచ్చారని, లేనివాళ్లు అక్కడే ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అయితే హరీష్ రావుకు నల్గొండ గురించి కానీ వ్యక్తిగతంగా నా గురించి మాట్లాడే హక్కు లేదని కోమటి రెడ్డి ఫైర్ అయ్యారు.

హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీనే ఎక్కువ కాలం పాలించిం దన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కోమటిరెడ్డి మంత్రిగా ఉన్నారనీ, వారి హయాంలోనే మూసీ మురికి కూపంగా

మిగితా 2వ పేజీలో

## 317 పై కవిత వర్సెస్ మంత్రి శ్రీధర్ బాబు





**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

శాసన మండలిలో 317జీవో రచ్చ రేపింది. బిఆర్ఎస్ ఎంఎల్సి కవిత, మంత్రి శ్రీధర్ బాబు మధ్య ఆసక్తికర చర్చకు దారితీసింది. ఎంఎల్సికవిత మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అప్పుడు ఏర్పాటు చేసిన కొత్త జిల్లాల మేరకు 317జీవో తీసుకరావడం జరిగిందని వెల్లడించారు. అందులో సమస్యలుంటే అధికారంలోకి వచ్చిన మీరు పరిష్కరించకుండా ఇంకా మాపై నిందలెందుకు? అని ప్రశ్నించారు. 317జీవో సమస్యలపై ఎంఎల్సిలు కోదండరాం, తీన్మార్ మల్లన్న, కవిత, జీవన్ రెడ్డి, ఎవిఎన్ రెడ్డి, వాణిలు మాట్లాడారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు సమాధానం ఇస్తూ కేంద్రహోంశాఖ నుంచి ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లో మార్పులతోనే 317జీవో వివాదాలకు శాశ్వత పరిష్కారమని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఏడు జోన్లు, రెండు మల్టీ జోన్లతో అశాస్త్రీయంగా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ తెచ్చారని విమర్శించా రు. దీంతో ఉద్యోగుల స్థానికత, సీనియార్టీలపై వివాదాలు రేగాయని, నాలుగు జిల్లాలకు కొత్త ఉద్యోగాలు రాని పరిస్థితి ఏర్పడిందన్నారు.

317జీవో రద్దు చెద్దామన్న

మిగితా 2వ పేజీలో

# మార్చి 21 నుంచి పది పరీక్షలు

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలో పదో తరగతి పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్ ను ఎస్ఎస్ సీ బోర్డు ప్రకటించింది. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

మార్చి 21న ఫస్ట్ లాంగ్వేజ్, 22న సెకండ్ లాంగ్వేజ్
మార్చి 24న ఇంగ్లీష్, 26న మ్యాథ్స్ పరీక్ష
మార్చి 28న ఫిజిక్స్, 29న బయోలాజికల్ సైన్స్
ఏప్రిల్ 2న సోషల్ స్టడీస్ పరీక్ష





## అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం


బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో గురువారం అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం ముదిరి పాకాన పడింది. బీఆర్ఎస్ సభ్యులు బీఆర్ఎస్ హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు సభలో వివాదాస్పదమయ్యాయి. ఆయన మాట్లాడుతుండగా కాంగ్రెస్ సభ్యులు దొంగ అంటూ కామెంట్ చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన ఆయన.. నన్ను దొంగ అన్న యూజ్ లెస్ ఫెలో ఎవరంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అసెంబ్లీలో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. అధికార పక్ష సభ్యుల ఆందోళనతో హరీశ్ రావు వ్యాఖ్యలను స్పీకర్ రికార్డుల నుంచి తొలగించారు. కాగా హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలని రాజగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. సీనియర్ సభ్యులు మాట్లాడాల్సిన వ్యాఖ్యలు ఇవి కాదని ఆక్షేపించారు. నన్న దొంగ అన్న వారిని యూజ్ లెస్ ఫెలో అనడం తప్పా? అని ఎదురు ప్రశ్నించారు. ఎవ్వరు అలా అన్నా క్షమాపణ చెప్పాల్సిందేనని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. స్పీకర్ జోక్యంతో వివాదం ముగిసింది. అంతకు ముందు ప్రివిలేజ్ మోషన్‌పై జరుగుతున్న స్వల్ప కాలిక చర్చ సందర్భంగా అక్బరుద్దీన్ ఒవైసీ సభను అడ్డుకున్నారు. సభ కార్యకలాపాలపై సభ్యులకు సరిగ్గా సమాచారం ఇవ్వట్లేదని అసహనం వ్యక్తం చేశారు. అసెంబ్లీనే సరిగ్గా నడపకలేపోతే.. ఇక ప్రభుత్వాన్ని ఎలా నడిపిస్తారంటూ అగ్రహం వ్యక్తం చేశారు. కోపంతో తన చేతిలో ఉన్న పేపర్‌ను విసిరేశారు. అక్బర్ లేవనెత్తిన అంశంతో హరీశ్‌రావుతో పాటు బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి సైతం స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విపక్ష, అధికార సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి.. సభలో గందరగోళం నెలకొంది. "విపక్ష సభ్యుల విమర్శలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. సభ నిర్వహణలో కొంత సమాచార లోపం జరిగింది... దీనికే స్పీకర్ సారీ చెబుతారా?. స్పీకర్ కార్యాలయం తీసుకునే నిర్ణయాలకు అన్ని పార్టీలు కట్టుబడి ఉండాల్సిందే.. చిన్నపాటి సమాచార లోపానికి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదు" అని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.. దాంతో తిరిగి హరీశ్ చర్చ ఆరంభించారు.

## ఆ చట్ట సవరణ బిల్లుల్లో బీసీల రిజర్వేషన్ల అంశమేదీ..?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్



స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. పురపాలక, జీహెచ్ఎంసీ, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుల్లో ఈ అంశం లేదని చెప్పారు. మూడు బిల్లులకు బీఆర్ఎస్ తరఫున సవరణలు ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. గురువారం అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. తమ సవరణలను ఖచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అవసరమైతే సభలో డివిజన్‌కు కూడా పట్టుబడుతామని స్పష్టం చేశారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. నవంబర్‌లోగా కులగణన పూర్తి చేస్తామని అధికారపార్టీ చెప్పిందన్నారు. కులగణనపై తేల్చకుండా చట్ట సవరణకు అసెంబ్లీలో ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 శాతానికిపైగా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా చేస్తున్నారని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లు ప్రస్తావించకపోవడం బీసీలను మోసం చేయడమేనని ఆరోపించారు.

# అధికార విపక్షాల పోటాపోటీ నిరసనలు..



బలగం టీవీ, న్యూఢిల్లీ

రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యల నేపథ్యంలో పార్లమెంట్ ఆవరణలో అధికార, విపక్షాల పోటాపోటీ నిరసనలు చేపట్టాయి. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీతోపాటు ఇండియా కూటమిలోని నేతలు నిరసన చేపట్టారు. అంబేద్కర్ చిత్రపటాలతోపాటు ప్లకార్డులు పట్టుకుని వారంతా అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమిత్ షా క్షమాపణలు చెప్పడంతోపాటు.. కేంద్ర హోమ్ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆ క్రమంలో అంబేద్కర్ విగ్రహం నుంచి పార్లమెంట్ మకర్ ద్వార్ వరకు వారంతా పాదయాత్ర చేపట్టారు.

మరోవైపు కాంగ్రెస్ పార్టీకి పోటీగా బీజేపీ సభ్యులు సైతం నిరసన బాట పట్టారు. బీఆర్ అంబేద్కర్ ను కాంగ్రెస్ పార్టీ అవమానించిందంటూ వారు సైతం ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని వారు ఆరోపించారు. అంతేకాకుండా.. 'బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానిస్తే సహించేది లేదంటూ, అంబేద్కర్ తమకు దారి చూపించారు.. కాంగ్రెస్ పార్టీ తప్పుదోవ పట్టించిందంటూ బ్యానర్లు పట్టుకుని బీజేపీ ఎంపీలు పెద్ద పెట్టున.. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అయితే బీఆర్ అంబేద్కర్ కు భారత రత్న ఇవ్వలేదని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ గాంధీ కుటుంబన్ని విమర్శించారు. అయితే గాంధీ కుటుంబంలోని వారంతా భారతరత్నలు అందుకున్నారని గుర్తు చేశారు. బీఆర్ అంబేద్కర్ ను కాంగ్రెస్ పార్టీ అవమాన పరిచిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ 24 గంటలు నిరాహార దీక్ష చేపట్టి.. ఆ పార్టీ చేసిన తప్పులకు ప్రాయశ్చితంగా మౌనం పాటించాలని గాంధీ కుటుంబానికి కేంద్ర మంత్రి సూచించారు. మరోవైపు అమిత్ షా క్షమాపణతోపాటు రాజీనామా కోరుతూ.. పార్లమెంట్ ప్రధాన ద్వారం మకర్ ద్వార్ గోడలు ఎక్కారు. ఇఖ రాహుల్ గాంధీ.. ఓ ఎంపీని తమపైకి నెట్టడం వల్ల ఓ ఎంపీ గాయపడ్డారని బీజేపీ పేర్కొంది.

పార్లమెంట్‌లో బీఆర్ అంబేద్కర్‌ను అవమానించారని ఆరోపిస్తూ అమిత్ షా ప్రసంగానికి సంబంధించిన వీడియోను కాంగ్రెస్ పార్టీ షేర్ చేయడంతో పెద్ద రాజకీయ వివాదం చెలరేగింది. ఇక రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా అంబేద్కర్ ను అవమాన పరిచిందని బీజేపీ ఆరోపించింది. అలాగ అమిత్ షా ప్రసంగానికి సంబంధిన వీడియోను సైతం ఆ పార్టీ తారుమారు చేసిందని విమర్శించింది. ఈ నేపథ్యంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బీజేపీ హెచ్చరించింది.

### ఎంపీకి గాయాలు

అధికారపక్షం ఎంపీలను ప్రతిపక్షాలు అడ్డుకునే సమయంలో బీజేపీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి ప్రతాప్ చంద్ర సారంగి కిందపడిపోయారు. దీంతో ఆయన తలకు స్వల్పగాయం అయ్యింది. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. ఎంపీ ప్రతాప్ చంద్ర సారంగి మాట్లాడుతూ.. నేను మెట్ల దగ్గర నిల్చున్నాను..రాహుల్ గాంధీ, ఓ ఎంపీని నెట్టేశారు. ఆ ఎంపీ వచ్చి నాపై పడటంతో నేను కిందపడిపోయాను అని ఆరోపించారు.

అయితే ఈ ఘటనపై రాహుల్ గాంధీ కూడా స్పందించారు. జరిగింది అంతా కూడా మీ కెమెరాల్లో రికార్డు అయ్యి ఉంది. అది చూడండి. నేను పార్లమెంట్ లోపలికి వస్తున్న క్రమంలో బీజేపీ ఎంపీలు నన్ను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. నన్ను పక్కకు తోసేశారు. బెదిరించారు. నన్నే కాదు మల్లికార్జున్ ఖర్గేను కూడా నెట్టేశారు. మాకు లోపలికి వెళ్లే హక్కు ఉంది. కానీ వారు మమ్మల్ని అడ్డుకుంటున్నారు. ఇక్కడ సమస్య ఏందంటే రాజ్యాంగంపై బీజేపీవాళ్లు దాడి చేస్తున్నారు. అంబేద్కర్ ను అవమానించారు అని రాహుల్ ఫైర్ అయ్యారు.

# నేను ఏ తప్పు చేయలేదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం బయటకు చెప్పడం లేదు. అన్నింటికి మించి ఫార్ములా ఈ వాళ్లు ఆర్బిట్రేషన్ ద్వారా కొట్లాడుతున్నారు. వాళ్ల మీద కేసు వేస్తే ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ ప్రభుత్వం ఇజ్జత్ పోదా..? అని కేటీఆర్ నిలదీశారు.

కేసు పెట్టదలచుకుంటే పెట్టుకో.. కానీ తెలంగాణ పరువు తీయకు. మేం భయపడం.. లీగల్ గా ఎదుర్కొంటాం.. ఎలాంటి పరిస్థితిని అయినా శాంతియుతంగా ఎదుర్కొంటాం. ఫార్ములా ఈ రేస్ నిర్వాహకులకు రూ. 55 కోట్లు చెల్లించింది వాస్తవం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. లైసెన్స్ ఫీజు రూ. 74 లక్షలు వాపస్ పంపుతూ ఎఫ్ఎంఎస్ఏ వాళ్లు లేఖ రాశారు అని కేటీఆర్ తెలిపారు. ఇందులో అవినీతి జరిగిందెక్కడో వివరణ ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఫార్ములా ఈ రేస్ కేసు వ్యవహారంపై కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.

25 అక్టోబర్ 2022న నాలుగు సీజన్ల కోసం సంతకాలు చేశాం. రేస్ చుట్టూ ఒక తెలంగాణ మొబిలిటీ వ్యాలీ ఏర్పాటు చేయాలి. ఇన్నోవేషన్, రీసెర్చ్, మ్యానుఫ్యాక్చరింగ్‌కు హబ్ కావాలని ఇదంతా చేశాం. ఫార్ములా ఈ వాళ్లను సంప్రదిస్తే.. ఇండియాలో వీలుకాదని చెప్పారు. కానీ తంటాలు పడి ఒప్పించాం. ఇది హైదరాబాద్ ఈవెంట్ కాదు.. ఇది ఇండియా ఈవెంట్. ఈ రేస్ వల్ల హైదరాబాద్‌కు బెనిఫిట్ ఏంటంటే.. హైదరాబాద్‌లో జరిగే ఈవెంట్‌కు హెచ్ఎండీఏ 35 కోట్లు ఖర్చు పెట్టాం. ఆ ప్రమోటర్ గ్రీన్ కో కంపెనీ 110 కోట్లు ఖర్చు పెట్టారు. ఇక రేస్ తర్వాత నెల్సన్ అనే సంస్థ అధ్యయనం చేసి రిపోర్టు ఇచ్చారు. హైదరాబాద్‌కు ఈ రేస్ వల్ల 82 మిలియన్ డాలర్ల ఎకనామిక్ బెనిఫిట్ వచ్చిందని చెప్పారు. ఖర్చు 150 కోట్లు మాత్రమే.. 550 కోట్ల అదనంగా ఎకానమిక్ బెనిఫిట్ జరిగింది. ప్రమోటర్‌గా వ్యవహరించిన గ్రీన్ కో కంపెనీ వాళ్లు నాకు పైసలు రాలేదని.. కాబట్టి నేను వెనక్కి వెళ్తున్నా.. వచ్చే ఏడాది చేయలేను అని చెప్పారు. 2023లో ఎన్నికలు, ఇతరత్రా ఉన్న క్రమంలో జూన్ నాటికి సెక్రటరి అరవింద్ కుమార్ వచ్చి.. నాలుగు ఏండ్ల అగ్రిమెంట్ ఉందని అడిగారు. ఈవీలకు తెలంగాణ హబ్ కావాలంటే.. ఎలన్ మస్క్ లాంటి వ్యక్తిని పట్టుకొచ్చి ప్రపంచ దృష్టిని ఆకర్షించాలనేది మా ప్రయత్నం. 3 ఆగస్టు 2023న ఫార్ములా ఈ నుంచి ఈమెయిల్ వచ్చింది. హెచ్ఎండీఏ నుంచి 55 కోట్లు కడుదామని చెప్పాను. రేస్ పోనివొద్దని.. ప్రమోటర్‌ను వెతుకుదామని చెప్పాను. అరవింద్ కుమార్ రెండు దఫాలుగా డబ్బులు పంపించారు. ఒకటేమో 5 అక్టోబర్, 11 అక్టోబర్ 2023న డబ్బులు పంపించారు. అక్టోబర్ 19న హైదరాబాద్‌ను కాలేండర్‌లో చేర్చుతూ ఫార్ములా ఈ రేస్ వారు నిర్ధారించారు. ఆ డబ్బులు కట్టడం వల్ల రేస్ మిగిలింది.. డబ్బులు కట్టకపోతే రేస్ పోయేది అభాసు పాలయ్యే వాళ్లం. ఇలాంటివి జరుగుతుంటాయి.. ప్రపంచంలో ఇది మొదటిసారి కాదు.. ఇదే చివరిసారి కాదు అని

## 317 పై కవిత వర్సెస్ మంత్రి శ్రీధర్ బాబు

(మొదటి పేజీ తరువాయి)

మళ్లీ కొత్త సమస్యలొస్తా యన్న ఆందోళన ఉందన్నారు. 317జీవోను ఉద్యోగులు మరణ శాసనంగా భావించారన్నారు. రాష్ట్ర ఉద్యోగుల ఫౌజు సమస్యలతో పాటు సెంట్రల్ ఎంప్లాయిస్ ఫౌజు కేసులపై కూడా నిర్ణయం తీసుకోవాల్సిఉందన్నారు. 317జీవో బాధితు లకు న్యాయం చేసేందుకు, సమస్యలు పరిష్కరిం చేందుకు సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే సబ్ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. దరఖాస్తుల వడపోత తర్వాత ప్రస్తుతం 32వేలకు పైగా దరఖాస్తులు ఉన్నాయన్నారు. 12మార్లు ఇప్పటికే సబ్ కమిటీ సమావేశమైందని, స్థానికత వివాదంగా మారిం దని, అడ్వకేట్ జనరల్ తో ఐదు సార్లు భేటీ అయ్యామని, శాస్త్రీయంగా సమస్య పరిష్కారం జరిగేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఉద్యోగుల సర్వీస్, పదోన్నతుల పరిరక్షణకు గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. 2018లో తీసుకొచ్చిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్ అమలులో ఉండేంత వరకు సమస్యలు ఎదురవుతున్నాయని, వాటిని పరిష్కరించే ప్రయత్నం జరుగుతుందన్నారు.

## మంత్రులే ప్రశ్నలు అడగడమేంటి?

(మొదటి పేజీ తరువాయి)

మారిందని విమర్శించారు. అప్పుడు వారు సరిగ్గా చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పారు. మూసీ వల్ల నల్లగొండ జిల్లా ప్రజలు బాధపడుతున్నారంటే దానికి ప్రధాన ముద్దాయి కాంగ్రెస్ పార్టీయే అని స్పష్టం చేశారు. ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2 పనులు పూర్తిచేసి కాళేశ్వరం జలాలను ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు నియోజకవర్గాలకు సాగు, తాగు నీటిని అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. నల్లగొండ జిల్లాకు కాంగ్రెస్ పార్టీ ఏం చేసింది? తాము ఏం చేశాం? అనేదానిపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాల్లో ప్రశ్నకు మంత్రులు సూటిగా జవాబు ఇస్తే బాగుంటుందని సూచించారు. అలాగైతే, పది ప్రశ్నలకు జవాబులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. మంత్రులు, అధికార పార్టీ సభ్యులు సుధీర్ఘ ప్రసంగాల వల్ల ప్రతిరోజు మూడు నాలుగు ప్రశ్నలకే సభాసమయం సరిపోతుందన్నారు. ఒక్కో ప్రశ్నకు సూటిగా సమాధానం వచ్చేలా చూడాలన్నారు. మంత్రులు లేచి రాజకీయ ప్రసంగాలు చేస్తే తాము కల్పించుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

# నాణ్యతతో మెనూ తప్పనిసరిగా పాటించాలి..



- ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష

**బలగం టీవీ , సిరిసిల్ల :**

ప్రభుత్వ విద్యాలయాలు, అంగన్వాడిల్లో తప్పనిసరిగా నాణ్యతతో మెనూను పాటించాలని ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష సూచించారు. జిల్లాలోని ఎల్లారెడ్డి పేట మండలంలోని అగ్రహారం, వెంకటాపూర్,ముస్తాబాద్ మండలం ఆవునూర్ లోని మండల పరిషత్, జిల్లా పరిషత్ విద్యాలయాలు, అంగన్వాడి కేంద్రాలను గురువారం ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా విద్యాలయాల్లో మెనూ చార్ట్ ను ముందుగా పరిశీలించారు. అనంతరం అక్కడ సిద్ధం చేస్తున్న ఆహార పదార్థాలు, వాటికి వినియోగిస్తున్న వివిధ పదార్థాల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టోర్ రూమ్ లోని నిల్వ చేసిన పదార్థాలను పరిశుభ్రతను తనిఖీ చేశారు. అనంతరం ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష మాట్లాడుతూ విద్యాలయాల్లో ప్రభుత్వ నిబంధనలు మేరకు నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను విద్యార్థులకు పెట్టాలని, కచ్చితంగా మెనూ పాటించాలని పేర్కొన్నారు. ఆహార ప్రాంతాలు సిద్ధం చేస్తున్న పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఇక్కడ ఆయా విద్యాలయాల హెచ్ఎంలు అంగన్వాయ అంగన్వాడి కేంద్రాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 24న రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ దిశ సమావేశం

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి.శేషాద్రి

**బలగం టీవీ, సిరిసిల్ల :**

డిసెంబర్ 24 మంగళవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లోని ఆడిటోరియం హాల్ లో రాజన్న సిరిసిల్ల మరియు కరీంనగర్ జిల్లాల అభివృద్ధి సమన్వయ మరియు మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం నిర్వహిస్తున్నామని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి.శేషాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి.శేషాద్రి మాట్లాడుతూ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రివర్యులు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చైర్మన్ గా జిల్లా అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ సమావేశం డిసెంబర్ 24 మంగళవారం నాడు జరుగుతుందని , ఇందులో రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి, శాసనసభ్యులు, ప్రభుత్వ విప్, శాసనమండలి సభ్యులు పాల్గొంటారని , ఇట్టి సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేయుచున్న పథకాల పై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, దానికి సంబంధించిన సమాచారంతో సంబంధిత జిల్లా అధికారులు విధిగా ఈ సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

# ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సోల్జర్‌గా ఉండాలి

- గంజాయిని తరిమి కొట్టాలి..
- విద్యార్థినుల భద్రతకు మొదటి ప్రాధాన్యత..
- ప్రతి మండలంలో పోలీస్ అక్క పేరుతో మహిళ కానిస్టేబుల్ ఎంపిక
- ఎస్పీ అఖిల్ మహాజన్



**బలగం టివీ , సిరిసిల్ల**

మహిళల,విద్యార్థినిల భద్రతకు సంబంధించి ఏ సమస్య ఉన్న నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని,ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సోల్జర్ గా ఉంటూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో గంజాయి లాంటి మత్తు పదార్థాలను తరిమి కొట్టాలని ఎస్పీ అఖిల్ మహాజన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. గురువారం ముస్తాబద్ మండలంలో అమర్ ఏఎంఆర్ ఫంక్షన్ హాల్ లో విద్యార్థులకు మహిళ రక్షణ, షీ టీమ్స్,ఈవ్ టీజింగ్ ,పొక్సో ,సైబర్ క్రైమ్స్,గంజాయి ఇతర అంశాలపై ఎస్పీ అఖిల్ మహాజన్ అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ మహిళలు మరియు చిన్న పిల్లల రక్షణ విషయంలో పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని, మహిళల భద్రత, ఆకతాయిల వేధింపుల నుండి మహిళల రక్షణ కొరకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తూ జిల్లా వ్యాప్తంగా షిటీమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థినీలు,మహిళలకు అవగాహన కల్పిస్తూ నిరంతరం వారికి అందుబాటులో ఉంటున్నదన్నారు. మహిళలను,యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని,మైనర్ బాలికల పై ఎవరైనా అఘాయిత్యాలు చేస్తే పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

**విద్యార్థినుల సమస్యలపై పోలీస్ అక్కకు పిర్యాదు చేయండి...**

విద్యార్థినులు భద్రతయే లక్ష్యంగా జిల్లాలో అన్ని మండలాల్లో పోలీస్ అక్క పేరుతో ఒక మహిళ కానిస్టేబుల్ ఎంపిక చేయడం జరిగిందని, ఈ పోలీస్ అక్క ఆయా మండలలో ఉన్న కళాశాలలు, పాఠశాలలతో కలుపుకొని ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేస్తు విద్యార్థినులు మీ సమస్యలపై పిర్యాదు అందగానే వెంటనే స్పందిస్తు అండగా నిలుస్తూ వారిలో ఆత్మవిశ్వాసం కలిగిస్తుందన్నారు.అంతే కాక జిల్లా షే టీం తో కలసి కళాశాలలు, పాఠశాలలతో మహిళ చట్టాలు, పొక్సో యాక్ట్, తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

**ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సోల్జర్ గా ఉంటూ గంజాయిని తరిమి కొట్టాలి...**

గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి పోలీస్ శాఖ విన్నూత కార్యక్రమాలు, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నార్కోటిక్ జాగిలాలు, గంజాయి కిట్ల సహాయంతో విస్తృతంగా తనిఖీలు చేపట్టి ఈ సంవత్సరం 93 కేసులలో 211 మందిని అరెస్ట్ చేసి 41 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని గంజాయి పై ఉక్కుపాదం మోపడం జరిగిందన్నారు.ప్రతి పాఠశాలలో, కలశాలలో యాంటీ డ్రగ్ క్లబ్స్ ఏర్పాటు చేసి మాధకద్రవ్యాలు, గంజాయి పై అవగాహన కల్పించడం జరిగిందని అందులో భాగంగా ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సోల్జర్ గా ఉంటూ గంజాయిని తరిమి కొట్టాలని అన్నారు.

విద్యార్థిని విద్యార్థుల సోషల్ మీడియా(ఫేసుబుక్, ఇంస్టాగ్రామ్)కు దూరంగా ఉండాలని,ప్రస్తుతం మహిళలపై వేధింపులు అఘాయిత్యాలు,సోషల్ మీడియా వేధింపులు ఆన్లైన్ వేధింపులు సైబర్ క్రైమ్స్, ఆన్లైన్ ఫ్రాడ్స్ ఎక్కువగా జరుగుతున్నాయని ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని అన్నారు.

మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా షీ టీమ్ నంబర్ 87126 56425 సమాచారం ఇవ్వగలరని, సమాచారం అందించిన వారి యొక్క వివరాలు గోప్యంగా ఉంచడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ మొగిలి, ఎస్ఐ గణేష్ , షీ టీం ఏఎస్ఐ ప్రమీల, షీ టీం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బూరుగుపల్లిలో పంటల నమోదు పరిశీలన

- సహాయ వ్యవసాయ సంచాలకులు, వేములవాడ డివిజన్ రామారావు



**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామంలో పంటల నమోదు పరిశీలనలో భాగంగా 15 సర్వే నంబర్ లని సహాయ వ్యవసాయ సంచాలకులు, వేముల వాడ డివిజన్ జె.రామారావు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రామారావు రైతులతో మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక ప్రమాదాలు సంభవించడమే కాకుండా ఆస్తి, ప్రాణ నష్టంతో పాటు పర్యావరణ ఆరోగ్యం కూడా దెబ్బ తింటుందని,వరి కొయ్యకాలకు నిప్పుపెడితే భూమి సారాన్ని కోల్పోవడంతో పాటు దిగుబడి తగ్గుతుందని, అలాగే ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది, పొలాన్ని కలియ దున్నితేనే పంటకు మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. తగలపెట్టవద్దు వరి కొయ్యలకు నిప్పు పెట్టడం వల్ల గాలి, నేల కలుషితమవుతుందని,పంటలకు మేలుచేసే మిత్ర పురుగులు మరణిస్తాయని,వరి కొయ్యలను పొలంలో కలియ దున్నితే సేంద్రియ ఎరువుగా మారుతుందని,ఎకరానికి దాదాపు టన్ను ఎరువు తయారవుతుందని అన్నారు. దున్నే ముందు తప్పనిసరిగా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే వరికొయ్యలు, గడ్డి మొక్కలు తొందరగా కుల్లిపోతాయి. మురిగిన కొయ్యలు ఎరువుగా మారడటంతో దిగుబడి పెరుగుతుంది. తద్వారా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించొచ్చని రైతులకు సూచించడం జరిగింది.వరికొయ్యలను (కొయ్యకాలు) కాల్చడం ద్వారా విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, ఫాస్ఫరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుంది. దిగుబడి పోతుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ప్రణీత, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీదేవి, రవళి, అనూష మరియు రత్నంపేట, దేశాయిపల్లి, బూరుగుపల్లి, మానువాడ గ్రామాలలో పంట నమోదులో భాగంగా అందుబాటులో ఉన్న రైతులకు ఈ విషయం గురించి అవగాహన కల్పించడం జరిగింది.



## తంగళ్ళపల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండల ప్రెస్ క్లబ్ రి. నెం 638/2017 నూతన అధ్యక్షుడిగా మోర శ్రీకాంత్ (నవ తెలంగాణ )ను క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా పూర్మని రాం లింగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా దుబ్బాక రాజు,(దిశ )ప్రధాన కార్యదర్శిగా రెడ్డి రాజశేఖర్,(ఆంధ్రప్రభ ) కోశాధికారిగా గాదగోని సాగర్,(బలగం టివి )సహాయ కార్యదర్శిగా గ్యాదనవేని మధు,(క్యాపిటల్ ఇన్ఫర్మేషన్) సాంస్కృతిక కార్యదర్శిగా రెడ్డిమల్ల దేవరాజు(నేటి తెలంగాణ )ముఖ్య సలహాదారులుగా సామల గట్టు,(నమస్తే తెలంగాణ )వెంగల శ్రీనివాస్(సాక్షి )ఏకగ్రీవమయ్యారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు జలగం అనిల్ కుమార్(సూర్య )తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మోర శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలోని ప్రజా సమస్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా కృషి చేస్తానన్నారు. విలేకరుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రెస్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# హైదరాబాద్‌లో రెండు భారీ అగ్నిప్రమాదాలు

**బలగం టీవీ , హైదరాబాద్**

హైదరాబాద్‌లో రెండు భారీ అగ్నిప్రమాదాలు జరిగాయి. ఓల్డ్ సిటీలోని ఓ స్క్రాప్ గోదాంలో, సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్‌లో మంటలు అంటుకున్నాయి. దీంతో భారీగా ఆస్తి నష్టం జరిగింది. గురువారం తెల్లవారుజామున మోండా మార్కెట్లోని ఓ పూజా స్టోర్‌లో మంటలు దట్టంగా వ్యాపించాయి. క్రమంగా అవి పక్కనే ఉన్న నాలుగు దుకాణాలకు అంటుకున్నాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో మంటలను ఆర్పివేశారు. అయితే భారీగా మంటలు ఎగసి పడటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పాతబస్తీలోని ఐఎస్ సదన్ పీఎస్ పరిధిలో ఉన్న మాదన్నపేట చౌరస్తాలో ఓ స్క్రాప్ గోదాంలో మంటలు అంటుకున్నాయి. తెల్లవారుజామున 4:30 ప్రాంతంలో ఈ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి పోలీసులు చేసుకున్నారు. ఆరు ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే గోదాంలోని వస్తువులు పూర్తిగా కాలి బూడిదైపోయాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు.

# బలగం గాయకుడు మొగిలయ్య కన్నుమూత



**బలగం టీవి, హైదరాబాద్**

బలగం చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ జానపద గాయకుడు మొగిలయ్య కన్నుమూశారు. కొంతకాలంగా కిడ్నీ, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన్ని కుటుంబసభ్యులు తెల్లవారుజామున 3 గంటలకు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా కన్నుమూశారు.

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలానికి చెందిన మొగిలయ్య బలగం సినిమాతో ఫేమ్ అయ్యారు. కొన్ని రోజులుగా ఆయన కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. మొగిలయ్య చికిత్స కోసం మెగాస్టార్ చిరంజీవితో పాటుగా బలగం దర్శకుడు వేణు..పలువురు ప్రముఖులు ఆర్థిక సాయం చేసారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గురువారం తెల్లవారు జామున మరణించారు. మొగిలయ్య వైద్య ఖర్చుల నిమిత్తం తెలంగాణ ప్రభుత్వంతో పాటుగా సినీ ప్రముఖులు సైతం



ఆర్థిక సాయం అందించారు.

మొగిలయ్య తన భార్య కొమురమ్మతో కలిసి జానపద పాటలు పాడుతూ జీవించేవారు. ఈ క్రమంలోనే వారిని గుర్తించిన దర్శకుడు వేణు తన బలగం చిత్రంలో క్లైమాక్స్‌లో వచ్చే పాటను కొమురయ్యతో పాడించారు. ఆ పాటను చూసిన ప్రేక్షకులంతా కన్నీళ్లు పెట్టుకోవడమే కాకుండా ప్రాణంపెట్టి ఆ పాట పాడిన మొగిలయ్య దంపతులను అభినందించారు. ఈ సినిమాతో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. మొగిలయ్య మరణం పట్ల బలగం సినిమా డైరక్టర్ వేణు యెల్దం డి, నటీనటులు, పలు వురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

బలగం సినిమాకు ముందు పస్తం మొగిలయ్యది నిరుపేద కుటుంబం. బలగం తర్వాత ఆర్థికంగా కాస్త నిలదొక్కుకున్నా.. ఆ వెంటనే అనారోగ్య సమస్యలు ఎదురయ్యాయి. దీంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మొగిలయ్య అండగా నిలిచింది. బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మొగిల య్యకు సాయం చేశారు. వైద్యం చేయిస్తానని భరోసా ఇచ్చారు. డయాలసిస్ ద్వారా చికిత్స



పొందుతున్న మొగిలయ్యను హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సాయం అందేలా చేశారు. మొగిలయ్య ఆర్థిక కష్టాల గురించి పెద్ది సుదర్శన్ రెడ్డి.. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వివరించారు. దీంతో కేసీఆర్ పస్తం మొగిలయ్యకు దళితబంధు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే మొగిలయ్యను వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు మరింత పెరిగాయి. ఆయన కుటుంబం పడుతున్న కష్టాలపై వచ్చిన వార్తలు అందరినీ కలిచివేశాయి. దీంతో పలువురు దాతలు ముందుకు వచ్చి తోచిన ఆర్థిక సాయం అందించారు.



## సీఎం సంతాపం

తెలంగాణ జానపద కళాకారుడు పస్తం మొగిలయ్య మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బేడ బుడగ జంగాల జానపద కళారూపం 'శారద కథల'కు బహుళ ప్రాచుర్యం కల్పించి, ఆ కళకే గొప్ప బలగంగా నిలిచిన మొగిలయ్య మరణం బడుగుల సంగీత సాహిత్య రంగానికి తీరని లోటు అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన పస్తం మొగిలయ్య గారు శారద తంబుర మీటుతూ, పక్కనే బుర్ర (డక్కీ) వాయిస్తూ వారి సతీమణి కొమురమ్మ గారు పలు చోట్ల ఇచ్చిన అనేక ప్రదర్శనలు వెలకట్టలేనివని, తెలంగాణ ఆత్మను ఒడిసిపట్టిన "బలగం" సినిమా చివర్లో వచ్చే మొగిలయ్య గారి పాట ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని గుర్తుచేశారు. ఈ బాధాకర సమయంలో పస్తం మొగిలయ్య గారి సతీమణి కొమురమ్మ గారితో పాటు వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి గారు ప్రగాఢ సానుభూతి తెలిపారు

ఇక ఇటీవల పొన్నం సత్తయ్య అవార్డు ఫంక్షన్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ మొగిలయ్య దంపతులకు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం చేసి ఇస్తామని, వైద్య ఖర్చులు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కొద్ది రోజుల క్రితం లక్ష ఆర్థిక సాయం అందించారు.

## మొగిలయ్య మృతి బాధాకరం : మంత్రి పొన్నం ప్రభాకర్

**బలగం టీవీ, హైదరాబాద్**



"బలగం మొగిలయ్య మృతి తీవ్ర ధ్రిగ్బాంతి కి గురి చేసింది.. బలగం సినిమా లో వారి పాట ద్వారా కుటుంబ బాంధవ్యాలను సమాజానికి చూపించారు. వారికి నా సంతాపాన్ని తెలియజేస్తున్నా . వారి సతీమణి కొమురవ్వ గారికి వారి కుటుంబ సభ్యులను నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్న. ఇటీవల మా నాన్న గారి పేరు మీద ఇచ్చిన పొన్నం సత్తయ్య గౌడ్ స్మారక సాహితీ పురస్కారాన్ని మొగిలయ్యా దంపతులకు ఇవ్వడం జరిగింది. వారి కళారూపాలు వారి పాటల ద్వారా ఎంతో ఆకట్టుకున్నారు. మొగిలయ్య కుటుంబానికి అండగా ఉంటాం." అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## మొగులన్నా.. నీ పాట తెలంగాణ బలగాన్ని మళ్లీ చాటింది



**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ జానపద కళాకారుడు బలగం మొగులయ్య మృతిపట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పాటకు చలించని హృదయం లేదన్నారు. పాట ద్వారా తెలంగాణ ప్రేమైక జీవనాన్ని ఆవిష్కరించారని చెప్పారు. మాయమైపోతున్న కుటుంబ సంబంధాలను మళ్లీ గుర్తుచేశారన్నారు. మొగులయ్య మరణించినా పాట రూపంలో బతికే ఉంటారని చెప్పారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. 'నీ పాటకు చెమర్చని కళ్ళు లేవు, చలించని హృదయం లేదు. నీ పాట ద్వారా తెలంగాణ ప్రేమైక జీవనాన్ని ఆవిష్కరించావ్. మాయమైపోతున్న కుటుంబ సంబంధాలను మళ్లీ గుర్తు చేసింది. మొగులన్నా.. నీ పాట తెలంగాణ బలగాన్ని మళ్లీ చాటింది. మానవీయకోణాన్ని ఆకాశమంత ఎత్తులో నిలిపింది. మొగులయ్య గారు మరణించినా పాట రూపంలో బతికే ఉంటారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలి. వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలి' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.







# ఆస్కార్ రేసు నుంచి లాపతా లేడీస్ అవుట్



- **షార్ట్‌లిస్ట్‌లో యూకే హిందీ చిత్రం 'సంతోష్', లైవ్ యాక్షన్ విభాగంలో 'అనూజ'**

**బలగం టీవి, హైదరాబాద్**

భారత్ నుంచి ఆస్కార్ పురస్కారాలకు అధికారికంగా ఎంపికైన 'లాపతా లేడీస్' చిత్రం రేసు నుంచి నిష్క్రమించింది. మంగళవారం ప్రకటించిన 2025 ఆస్కార్ షార్ట్‌లిస్ట్‌లో ఈ సినిమాకు చోటు దక్కలేదు.అగ్ర నటుడు అమీర్‌ఖాన్ నిర్మించిన ఈ సినిమాకు ఆయన మాజీ సతీమణి కిరణ్ రావు దర్శకురాలు. స్పర్శ్ శ్రీవాత్సవ, నితాన్షి గోయెల్, ప్రతిభ ప్రధాన పాత్రల్లో నటించారు. 2001లో జరిగే ఈ కథలో భారతీయ సమాజంలో కట్టుబాట్ల పేరుతో మహిళల స్వేచ్ఛను హరిస్తున్న తీరుని, వారిపై పురుషాధిక్యాన్ని సందేశాత్మకంగా ఆవిష్కరించారు. మహిళా సాధికారత అవశ్యకతను తెలియజేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దురాచారాలను రూపుమాపాలనే అంశాలను చర్చిస్తూ కిరణ్ రావు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఓవైపు వినోదాన్ని పంచుతూనే అంతర్లీనంగా చక్కటి సందేశంతో ఈ సినిమా మెప్పించింది. పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అవార్డులను సొంతం చేసుకున్న ఈ సినిమా ఆస్కార్ బరి నుంచి నిష్క్రమించడంతో చిత్ర యూనిట్, సినీ అభిమానులు నిరాశలో ఉన్నారు.

**షార్ట్‌లిస్ట్‌లో భారతీయులు తీసిన 'సంతోష్'**

ఇంగ్లాండ్‌కు చెందిన షనాహ గోస్వామి ప్రధాన పాత్రలో సంధ్యా సూరి దర్శకత్వంలో రూపొందిన హిందీ చిత్రం 'సంతోష్' యూకే నుంచి ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో స్థానం దక్కించుకుంది. ఉత్తర భారతంలోని గ్రామీణ నేపథ్య కథాంశమిది. పోలీస్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఓ విధవరాలు గ్రామంలో జరిగిన బాలిక హత్యోదంతాన్ని ఎలా ఛేదించిందన్నదే ఈ చిత్ర కథ. 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ సినిమాకు ప్రశంసలు దక్కాయి. ఆస్కార్ పురస్కారం సాధించే అవకాశాలు ఈ సినిమాకు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆస్కార్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ కేటగిరీలో మనదేశం నుంచి 'అనూజ' షార్ట్‌లిస్ట్ అయింది. గునీత్‌మోంగా కపూర్ ఈ చిత్రానికి నిర్మాత. న్యూఢిల్లీలోని బట్టల మిల్లులో తన సోదరితో కలిసి పనిచేసే తొమ్మిదేళ్ల అనూజ అనే బాలిక కథ ఇది. బోర్డింగ్ స్కూల్‌లో విద్యనభ్యసించాలనే అనూజ సంకల్పానికి ఎలాంటి అవరోధాలు ఎదురయ్యాయన్నదే ఈ సినిమా కథలో ప్రధానాంశం.

## నేడు థియేటర్‌లలో ఆర్‌ఆర్‌ఆర్ డాక్యుమెంటరీ..

**బలగం టీవి, హైదరాబాద్**

యంగ్ టైగర్ ఎన్టీఆర్, గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్‌లు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ఆర్‌ఆర్‌ఆర్. దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకుంది. అలియాభట్, ఒలివియా మోరిస్, అజయ్ దేవ్‌గణ్, శ్రియ కీలకపాత్రలు పోషించిన ఈ మూవీని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మించారు. 2022 మార్చి 24 న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించింది. ఈ చిత్రంలోని నాటు నాటు పాట ఆస్కార్ అవార్డును సొంతం చేసుకుంది. తాజాగా డాక్యుమెంటరీ రూపంలో ప్రేక్షకులను మరోసారి అలరించేందుకు సిద్ధమైంది ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర బృందం. ఆర్‌ఆర్‌ఆర్ సినిమా తెరకెక్కడం వెనుక ఎంతో మంది కష్టం ఉంది. దాదాపు మూడేళ్ల పాటు చిత్రీకరణ జరుపుకుంది. షూటింగ్ మొదలు పెట్టిన నాటి నుంచి ఆస్కార్ అందుకునే వరకు జరిగిన ఎన్నో ఆసక్తికర ఘట్టాలతో డాక్యుమెంటరీని రూపొందించారు. 'ఆర్‌ఆర్‌ఆర్– బిహైండ్ అండ్ బియాండ్' పేరుతో శుక్రవారం థియేటర్లఓ రిలీజ్ కానుంది. ఈ మేరకు మేకింగ్ ట్రైలర్ రిలీజ్ చేసి అంచనాలు పెంచారు. డాక్యుమెంటరీ సింగల్ స్క్రీన్స్ లో కాకుండా మల్టీప్లెక్ లో మాత్రమే రిలీజ్ కానుంది. ఈ డాక్యుమెంటరీకి రూ.200 నుంచి 300 వరుకు టికెట్ ప్రైస్ ఫిక్స్ చేసారు. బుక్ మై షోలో డాక్యుమెంటరీ సంబంధించిన టికెట్స్ అందుబాటులో ఉంచారు. ఈ డాక్యుమెంటరీ నిడివి 1 గంట 38 నిమిషాలు ఉంది. అలాగే నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతుంది.తెలుగు సినిమాగా మొదలై ఆస్కార్ లెవెల్‌కు ఆర్‌ఆర్‌ఆర్ ఎలా చేరింది? సినిమా రూపకల్పనలో యూనిట్ ఎదుర్కొన్న సవాళ్లు, మూవీ సాధించిన అవార్డులు, రికార్డుల గురించి ఈ డాక్యుమెంటరీలో చూపించబోతున్నట్లు సమాచారం.

## నేడే 'ముఫాసా' .. మహేశ్ ఫ్యాన్స్ హంగామా

**బలగం టీవి, హైదరాబాద్**



హాలీవుడ్ సూపర్ హిట్ సినిమా ది లయన్ కింగ్ కి ప్రీక్వెల్ గా వస్తున్న ముఫాసా శుక్రవారం రిలీజ్ కానుంది. అయితే తెలుగులో ఈ సినిమాలోని మెయిన్ లీడ్ ముఫాసా సింహం పాత్రకు మహేష్ బాబు వాయిస్ ఇచ్చారు. ముఫాసా సినిమాకు మహేష్ సోషల్ మీడియాలో కూడా ప్రమోషన్స్ చేస్తున్నారు. ముఫాసాకు వాయిస్ ఇవ్వడం ఒక అద్భుతమైన అనుభవం. ఇది ఎప్పుడూ నా మనసుకు హత్తుకుంటుంది. మీరు కూడా నాలాగే డిస్నీ ముఫాసా చూసేటప్పుడు మంచి అనుభవాన్ని పొందుతారని భావిస్తున్నాను అని పోస్ట్ చేసారు. దీంతో ఈ సినిమా మీద తెలుగులో మంచి హైప్ రావడమే కాక ఫ్యాన్స్ అయితే ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. మహేష్ బాబు వాయిస్ అయినా విందామని ఆయన ఫ్యాన్స్ థియేటర్స్ వద్ద ఇప్పట్నుంచే రచ్చ చేస్తున్నారు. సింహం, మహేష్ బాబు ఉన్న కటౌట్స్ అన్ని ఊర్లల్లో మెయిన్ థియేటర్స్ వద్ద పెడుతూ రచ్చ చేస్తున్నారు.